# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

గురువారం 14 ఆగస్టు 2025 పేజీలు 8




# మల్లంపేటలో హర్‌ఘర్ తిరంగ ర్యాలీ..

## ఎన్‌సిసి విద్యార్థులతో కలిసి బీజేవైఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ..



**దుండిగల్, పెన్ పవర్, ఆగష్టు 13**: తిరంగా ర్యాలీ దేశ స్వతంత్ర సమగ్రతకి చిహ్నం, దేశ ప్రజల్లో చైతన్యాన్ని, దేశభక్తిని నింపడంతోపాటు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ఈ ర్యాలీ నిర్వహించాలని బీజేవైఎం జిల్లా కార్యదర్శి అతిష్‌బాబు అన్నారు.. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు దుండిగల్ మండలం మల్లంపేట్‌లో కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగర్యాలీలో బీజేవైఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి అతీష్ బాబు పాల్గొన్నారు.. బుధవారం మల్లంపేటలో ప్రగతి డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సిసి విద్యార్థులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.. బైకులపై భారత మాతకి జై అని నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది.. అనంతరం అతిష్ బాబు మాట్లాడుతూ ఈ తిరంగా ర్యాలీ దేశ స్వతంత్ర సమగ్రత కి చిహ్నం అంటూ కొనియాడారు.. దేశ ప్రజల్లో చైతన్యాన్ని, దేశభక్తిని నింపడంతోపాటు ప్రతి ఇంటిపై జాతీయ జెండాలను ఎగురవేయాలనే సంకల్పంతో ఈ ర్యాలీ నిర్వహించినట్లు అతిష్‌బాబు తెలిపారు.. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి అధికారి మేజర్ డి.రత్నాజీ, బీజేపీ నాయకులు మరియు కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# హైదరాబాద్‌లో భారీ వర్షం.. ప్రజలకు హైడ్రా కమిషనర్ సూచన

- అధికారులతో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న రంగనాథ్
- అధికారులకు ప్రజలు సహకరించాలని సూచన
- బోట్లను సిద్ధం చేసినట్లు తెలిపిన రంగనాథ్



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. అధికారులకు ప్రజలు సహకరించాలని సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీ డనం కారణంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

-2 లో

# కృష్ణమ్మ బిరబిర.. గోదావరి వెలవెల..

## నిండుకుండల్లా శ్రీశైలం, నాగార్జున సాగర్





- శ్రీశైలంలో ఆరు గేట్లు ఓపెన్
- 26 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల
- శ్రీరాంసాగర్ కు స్వల్పంగా వరద
- ఎగువ నుంచి 12,769 క్యూసెక్కులు
- ఎల్లంపల్లిలోనూ అదే పరిస్థితి

హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో ఉన్న జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు ఎగువ నుంచి భారీ గా వరద వస్తుండటంతో గేట్లు ఓపెన్ చేసి నీటిని వదలుతున్నారు. గోదావరి బేసిన్ లో శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులకు స్వల్పంగా వరద వస్తోంది. కడెం, స్వర్ణ జలాశయాల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి 1,66,957 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 883 అడుగులుగా ఉంది. కుడి, ఎడమ విద్యుదుత్పత్తి కేంద్రాల్లో పవర్ జనరేషన్ నడుస్తోంది. ఆరు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టులో 26 గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. జలాశయం వద్ద ఇన్‌ఫ్లో 2,28,601 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,47,986 క్యూసెక్కులుగా ఉంది. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు.. కాగా ప్రస్తుత నీటిమట్టం 589.20 అడుగులుగా నమోదైంది. పూర్తి నీటినిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు.. కాగా ప్రస్తుతం 309.65 టీఎంసీలకు చేరింది. గోదావరి పరిధిలోని శ్రీరాంసాగర్ జలాశయానికి వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువ నుంచి 12,769 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులు కాగా 1080 అడుగుల నీరుంది. కాకతీయ, సరస్వతి కాలువలతో పాటు మిషన్ భగీరథకు నీటి విడుదల కొనసాగుతోంది.

-2 లో

# నేడు తెలంగాణ అంతటికీ రెడ్ అలర్ట్ జారీ

- భారీ వర్షాల నేపథ్యంలో తెలంగాణ అంతటికీ రెడ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ కేంద్రం
- ఈ మేరకు వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న ప్రకటన
- రాష్ట్రవ్యాప్తంగా నేడు కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:భారీ వర్షాల నేపథ్యంలో హైదరా బాద్ వాతావరణ కేంద్రం తెలంగాణ అంతటికీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ మేరకు వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న ప్రకటిం చారు. ఖమ్మం, భద్రాద్రి, మెదక్, వికారాబాద్, భూపా లపల్లి, ములుగు, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వెల్లడించారు. అలాగే కామారెడ్డి, జనగామ, కుమురం భీం, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, మంచిర్యాల, నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, మంచిర్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రేపు కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇక, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడొచ్చని నాగరత్న చెప్పారు.

# యుద్ధానికి వెళుతున్నారా..

- వాహనాలకు అసహజ రంగులెందుకు?
- ప్రజలను ఎందుకు ఇబ్బందిపెడతారు?
- హైడ్రాపై హైకోర్టు వ్యాఖ్యలు
- ఎఫ్‌టీఎల్‌పై విధాన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన

-2లో

# యుద్ధానికి వెళుతున్నారా..

- వాహనాలకు అసహజ రంగులెందుకు?
- ప్రజలను ఎందుకు ఇబ్బందిపెడతారు?
- హైడ్రాపై హైకోర్టు వ్యాఖ్యలు
- ఎఫ్‌టీఎల్‌పై విధాన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన




**హైదరాబాద్ పెన్ పవర్:** చెరువుల్లో ఆక్రమణల తొలగింపు... ప్రభుత్వ స్థలాల పరిరక్షణ నేపథ్యంలో ప్రజలను ఎందుకు ఇబ్బంది పెడతారు... చర్యలు తీసుకునే సమయంలో హడావుడి లేకుండా నెమ్మదిగా పనిచేసుకోలేరా అంటూ బుధవారం హైకోర్టు హైడ్రాను ప్రశ్నించింది. 'ఎలా పడితే అలా వెళతారా? హైడ్రా వాహనాలకు ఆ అసహజ రంగులెందుకు? మీరేమైనా యుద్ధానికి వెళుతున్నారా' అని నిలదీసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలో తమ్మిడిగుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రైవేటు వ్యక్తులకు చెందిన స్థలంలో చెరువు పునరుద్ధరణ పనులపై యథాతథస్థితి కొనసాగించాలన్న ఉత్తర్వులను ఉల్లంఘించి హైడ్రా పనులు కొనసాగించడాన్ని సవాలు చేస్తూ ఎస్.వెంకటేశ్వరరావు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌తోపాటు, రిట్ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. ఇరుపక్షాలు యథాతథస్థితి కొనసాగించాలని న్యాయస్థానం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైడ్రా ఉల్లంఘించి కోర్టు ధిక్కరణకు పాల్పడిందని పిటిషనర్ న్యాయవాది తరుణ్ జి.రెడ్డి వివరించారు. పిటిషనర్‌కు చెందిన స్థలం 6 ఎకరాల్లో ఎలాంటి పనులు చేపట్టబోమని, మిగిలిన ప్రాంతంలో పనులు చేపట్టడానికి అనుమతించాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. "కోర్టు ఉత్తర్వుల అమలుపై అధికారులకు లెక్క లేదు. ఏదో ఒక రోజు కోర్టు ఉత్తర్వులంటే ఏమిటో రుచి చూపిస్తాం. కోర్టుకు ఉన్న అధికారం ఏమిటో అప్పుడు తెలుస్తుంది. హైడ్రా కమిషనర్‌కు కూడా కోర్టు ఉత్తర్వుల ప్రాధాన్యం తెలుసు" అని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

ఎన్నేళ్లు ఇలా వివాదాలతో కొనసాగిస్తారు?

"ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలంటూ హైడ్రా కూల్చివేతలు చేపడుతోంది. ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి ప్రభుత్వం ఒక విధాన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాకాకుండా ఎన్నేళ్లు ఇలా వివాదాలతో కొనసాగిస్తారు? ఒకవేళ ఎఫ్‌టీఎల్‌లో ప్రైవేటు పట్టా భూమి ఉంటే భూసేకరణ చట్టం ద్వారా సేకరించాలి. అలా చేస్తే వివాదాలకు తెరపడుతుంది" అని న్యాయస్థానం సూచించింది. విచారణ సోమవారానికి వాయిదా పడింది.

## కృష్ణమ్మ బిరబిర.. గోదావరి వెలవెల..

### నిండుకుండల్లా శ్రీశైలం, నాగార్జున సాగర్

- మొదటి పేజి తరువాయి

నిర్మల్ జిల్లాలోని స్వర్ణ ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. పూర్తి మట్టం 1183 అడుగులు కాగా..1182.9 ఫీట్ల నీరుంది. ఒక గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇదే జిల్లాలోని కడెం జలాశయానికి భారీగా వరద నీరు వస్తోంది. పూర్తి స్థాయి మట్టం 700 అడుగులు కాగా.. 695 ఫీట్లకు నీరు చేరింది. రెండు వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 16,027 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం 20 టీఎంసీలు కాగా..ప్రస్తుతం13.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మూసీ నదికి

వరద పోటెత్తింది. వలిగొండ మండలం సంగెం పరిధిలోని భీమలింగం వద్ద మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. లో లెవల్ బ్రిడ్జిపై నుంచి వరద పోటెత్తింది. దీంతో సంగెం పరిసర ప్రాంతాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు ప్రమాదాలు జరకుండా నియంత్రిస్తున్నారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం..

### ప్రజలకు హైడ్రా కమిషనర్ సూచన

- మొదటి పేజి తరువాయి

భారీ వర్షాలు కురుస్తున్నాయి.

ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ మాట్లాడుతూ, భాగ్యనగరంలోని వివిధ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. 51 డీఆర్ఎఫ్, 151 మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లను సిద్ధంగా ఉంచామని ఆయన వెల్లడించారు. హైడ్రా బృందం 9 బోట్లను, ఎన్డీఆర్ఎఫ్ 6 బోట్లను సిద్ధంగా ఉంచిందని అన్నారు. హైదరాబాద్ నగరంలో 450 వరకు నీరు నిలిచే ప్రాంతాలు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం అధికారులను సిద్ధం చేశామని తెలిపారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

నాలాలు, మూసీ పరివాహక ప్రాంతాల్లో, ముంపు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. హుస్సేన్ సాగర్ నుంచి నీటిని ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ జీహెచ్ఎంసీ అప్రమత్తంగా ఉందని తెలిపారు. అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆయన కోరారు.

## ఆగస్టు 20నుంచి గ్రూప్-2 రెండో

# విడత సర్టిఫికెట్ల వెరిఫికేషన్




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (%ఱ+ూాజ%) గ్రూప్-2 పోస్టులకు రెండో విడత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తేదీలను ప్రకటించింది. ఈ వెరిఫికేషన్ ప్రక్రియ ఆగస్టు 20 నుంచి ఆగస్టు 23, 2025 వరకు మూడు రోజుల పాటు జరగనుంది. ఈ వెరిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

వెరిఫికేషన్ వివరాలు

**తేదీలు:** ఆగస్టు 20, 2025 నుంచి ఆగస్టు 23, 2025 వరకు.


**స్థలం:** సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీ, పబ్లిక్ గార్డెన్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్.

**హాజరు కావాల్సిన వారు:** నోటిఫికేషన్ నెం.11/2022 ప్రకారం ఎంపికైన ఎక్స్టెన్షన్ ఆఫీసర్ (సూపర్వైజర్) గ్రేడ్-I పోస్టులకు సంబంధించిన అభ్యర్థులు.

**అవసరమైన డాక్యుమెంట్లు :** అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు, ఒక సెట్ స్వయంగా సంతకం చేసిన జీరాక్స్ కాపీలను తీసుకురావాలి.

ఈ వెరిఫికేషన్ ప్రక్రియకు సంబంధించిన మరింత సమాచారం ,అభ్యర్థుల జాబితా కోసం %ఱ+ూాజ% అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. అభ్యర్థులు వెరిఫికేషన్‌కు హాజరయ్యే ముందు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న పూర్తి షెడ్యూల్ ,సూచనలను తప్పనిసరిగా పరిశీలించాలి.

## తెలంగాణలోని పది జిల్లాల్లో అతి భారీ వర్షాలు.. రెడ్ అలెర్ట్ జారీ



**హైదరాబాద్ పెన్ పవర్:**బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గతమూడు రోజులుగా తెలంగాణతోపాటు ఏపీలో పలు జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. ప్రధాన రహదారులు చెరువుల్లా తలపిస్తున్నాయి.తెలంగాణ, ఏపీల్లో పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. చెరువులు, కుంటలు ఉప్పొంగి పొర్లుతున్నాయి. రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

తెలంగాణ రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి , ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, ములుగు, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్ , యాదాద్రి భువనగిరి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రెడ్ అలెర్ట్ జారీ చేసింది ఐఎండీ. ఆదిలాబాద్, హనుమకొండ, హైదరాబాదద్, జనగాం, కామారెడ్డి, కుమ్రం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్లగొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లో కూడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. జగిత్యాల, జోగులాంబ గద్వాల, కరీంనగర్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల , వనపర్తి జిల్లాలో అక్కడదక్క భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోవైపు తెలంగాణ లోని మిగతా జిల్లాల్లో కూడా అక్కడక్కడ తేలికపాటినుంచి మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది వాతావరణ శాఖ.

## ఈ జింకకు ట్రాఫిక్ రూల్స్ బాగా తెలుసు..రెడ్ సిగ్నల్ పడిందని రోడ్డుపైనే ఆగింది..

**హైదరాబాద్ పెన్ పవర్:**జపాన్‌లో జింకల జంట తమ ప్రవర్తనతో అందరినీ ఆశ్చర్యపరిచింది.రోడ్డుమీదకు వచ్చిన ఆ జింక, ట్రాఫిక్ సిగ్నల్ రెడ్ పడగానే కచ్చితంగా ఆగిపోయింది. గ్రీన్ సిగ్నల్ వచ్చే వరకు ఓపికగా నిలబడి, తర్వాతే రోడ్డు దాటింది. ఈ ఘటనను చూసిన వారంతా ఆశ్చర్యపోయారు. ట్రాఫిక్ నిబంధనలు మనుషులు పాటించకపోయినా, జంతువులు పాటిస్తున్నాయంటూ చర్చించుకున్నారు. ఈ విషయం తెలిసిన నెటిజన్లు కూడా చర్చకు దారి తీసింది. ఈ వైరల్ వీడియో జపాన్‌లోని నారా పార్క్ దగ్గర జరిగిన సంఘటనకు సంబంధించింది. ఈ పార్కు జింకలకు ప్రసిద్ధి చెందింది. ఈ క్లిప్‌ను డిజిటల్ సృష్టికర్త @amina_finds ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. జపాన్‌లో జింకలు కూడా జైవాక్ చేయవు. అందరూ చాలా క్రమశిక్షణతో ఉంటారు అంటూ క్యాప్షన్ ఇచ్చారు. జపాన్?లో జింకలు1000IQ గలవి అని కూడా రాశారు. వీడియోలో రాసినట్లు నిజంగానే ఆ రెండు జింకలు ఓపిగ్గా ఆగి, ట్రాఫిక్ సిగ్నల్ గ్రీన్ వచ్చాక రోడ్డు దాటాయి. జింకలలో కూడా మనుషుల్లో ఉన్న సృహను చూసి అక్కడివారంతా ఆశ్చర్యపోయారు. కాంతి ఆకుపచ్చగా మారిన క్షణం, జింకలు ఎటువంటి ఒత్తిడి లేకుండా ఎటువంటి భయం లేకుండా రోడ్డు దాటడం వీడియోలో కనిపిస్తుంది.

# కొత్త కస్టమర్లకు HDFC షాక్.. సేవింగ్స్ అకౌంట్ మినిమం బ్యాలెన్స్ రూ.25వేలకు పెంపు..!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకపక్క ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంకింగ్ సంస్థలు తమ కస్టమర్లకు మినిమం బ్యాలెన్స్ రూల్స్ నుంచి ఉపశమనం కల్పిస్తున్నాయి. కానీ మరో పక్క ప్రైవేటు బ్యాంకులు మాత్రం తమ కస్టమర్లకు అకౌంట్లో కనీసం ఉంచాల్సిన మినిమం బ్యాలెన్స్ లిమిట్స్ పెంచేస్తున్నాయి. వారం ప్రారంభంలో ఐసిఐసిఐ కొత్త సేవింగ్స్ ఖాతా ఓపెన్ చేయాలంటే మెట్రో నగరాల్లో కనీసం రూ.50వేలు మినిమం బ్యాలెన్స్ తప్పదంటూ కొత్త నిబంధనలు తీసుకొచ్చి అందరినీ షాక్ కి గురిచేసిన సంగతి తెలిసిందే. దీనిని మరచిపోక మునుపే మరో దిగ్గజ బ్యాంక్ హెచ్‌డిఎఫ్‌సి కూడా తన కస్టమర్లకు మినిమం బ్యాలెన్స్ రూల్స్ అప్ డేట్ చేసింది. ఆగస్టు 1, 2025 నుంచి కొత్తగా సేవింగ్స్ అకౌంట్ ఓపెన్ చేసే కస్టమర్లకు ఈ పెంచిన మినిమం బ్యాలెన్స్ రూల్స్ వర్తిస్తాయని బ్యాంక్ స్పష్టం చేసింది. దీంతో మెట్రో, అర్బన్ ప్రాంతాల్లోని శాఖలో సేవింగ్స్ అకౌంట్ ఓపెన్ చేయాలంటే గతంలో ఉన్న రూ.10వేలు మినిమం బ్యాలెన్స్ లిమిట్ ప్రస్తుతం రూ.25వేలకు పెంచేసింది హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్. ఒకవేళ మినిమం బ్యాలెన్స్ రూల్స్ కంటే ఖాతాలో తక్కువ నగదు ఉన్నట్లయితే రూల్స్ ప్రకారం పెనాల్టీ ఛార్జీలు వసూలు చేస్తామని బ్యాంక్ వెల్లడించింది. ఖాతాలో మినిమం బ్యాలెన్స్ పాటించకపోతే మెట్రో సేవింగ్స్ ఖాతలపై 6 శాతం లేదా రూ.600 వరకు పెనాల్టీ వర్తిస్తుందని బ్యాంక్ చెప్పింది. ఇకపోతే బ్యాంక్ తన క్లాసిక్ కస్టమర్లు నెలకు రూ.లక్ష మినిమం బ్యాలెన్స్ లేదా త్రైమాసికంలో రూ.2 లక్షల్లో ఏదో ఒకటి కలిగి ఉంటే సరిపోతుందని వెల్లడించింది హెచ్‌డిఎఫ్‌సి. లేదంటే కస్టమర్ శాలరీడ్ అయితే నెలకు కనీసం లక్ష రూపాయలు లేదా అంత కంటే ఎక్కువ వేతనం జమ అయినా సరిపోతుందని స్పష్టం చేసింది.

ప్రస్తుతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్ మాత్రం కస్టమర్లు ఎలాంటి మినిమం బ్యాలెన్స్ తమ సేవింగ్స్ ఖాతాలో ఉంచకపోయినా పెనాల్టీలు ఉండవని వెల్లడించింది. ఇక కోటక్ బ్యాంక్ తన క్లాసిక్ సేవింగ్స్ ఖాతాకు రూ.10వేలు, యెస్ బ్యాంక్ ప్రో ప్లస్, ఎసెన్స్ సేవింగ్స్ ఖాతాలకు మినిమం బ్యాలెన్స్ రూ.25వేలుగా ఉంచాయి. ఇక యెస్ బ్యాంక్ ప్రో మ్యాక్స్ సేవింగ్స్ ఖాతా మినిమం బ్యాలెన్స్ రూ.50వేలుగా ఉంచాయి.

# గూగుల్ క్రోమ్‌ను కొంటాం: పర్‌ప్లెక్సిటీ సంచలన ఆఫర్




**హైదరాబాద్ పెన్ పవర్:**టెక్ ప్రపంచంలో ఓ సంచలన పరిణామం చోటుచేసుకుంది. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన వెబ్ బ్రౌజర్ గూగుల్ క్రోమ్‌ను కొనుగోలు చేసేందుకు కృత్రిమ మేధ (ఏఐ) స్టార్టప్ పర్‌ప్లెక్సిటీ ముందుకొచ్చింది. భారత సంతతికి చెందిన అరవింద్ శ్రీనివాస్ నేతృత్వంలోని ఈ సంస్థ, క్రోమ్ కోసం ఏకంగా 34.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 3.02 లక్షల కోట్లు) ఆఫర్ చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

గూగుల్ సంస్థ ప్రస్తుతం అమెరికా ప్రభుత్వ యాంటీ-ట్రస్ట్ ఆరోపణల కారణంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. బ్రౌజర్ మార్కెట్‌లో గుత్తాధిపత్యాన్ని అడ్డుకునేందుకు క్రోమ్‌ను విక్రయించాలని అమెరికా న్యాయ విభాగం సూచిస్తున్న తరుణంలో, పర్‌ప్లెక్సిటీ ఈ భారీ ఆఫర్‌తో రంగంలోకి దిగింది. తమ కంపెనీ విలువ కంటే దాదాపు రెట్టింపు మొత్తాన్ని ఆఫర్ చేయడం ఈ స్టార్టప్ సాహసాన్ని తెలియజేస్తోంది. ఈ ఒప్పందానికి అవసరమైన నిధులను బయటి పెట్టుబడిదారుల ద్వారా సమీకరించనున్నట్లు పర్‌ప్లెక్సిటీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ దిమిత్రి షెవెలెంకో వెల్లడించారు. బ్లూమ్‌బర్గ్ కథనం ప్రకారం, పలువురు ఇన్వెస్టర్లు ఈ డీల్‌కు పూర్తి ఆర్థిక సహాయం అందించేందుకు ఇప్పటికే అంగీకరించారు. ఈ ఆఫర్‌ను ధ్రువీకరించిన పర్‌ప్లెక్సిటీ, ఒప్పందం విజయవంతమైతే క్రోమ్‌లో కొన్ని కీలక మార్పులు చేయబోమని స్పష్టం చేసింది.క్రోమ్ కోర్ ఇంజిన్ అయిన 'క్రోమియం'ను ఓపెన్ సోర్స్‌గానే కొనసాగిస్తామని, దాని అభివృద్ధికి ఏటా 3 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతామని హామీ ఇచ్చింది. ముఖ్యంగా, వినియోగదారుల ఆందోళనలను తొలగిస్తూ, బ్రౌజర్‌లో డిఫాల్ట్ సెర్చ్ ఇంజిన్‌గా గూగుల్‌నే ఉంచుతామని, తమ సొంత పర్‌ప్లెక్సిటీ సెర్చ్‌ను డిఫాల్ట్‌గా మార్చబోమని స్పష్టం చేసింది.పర్‌ప్లెక్సిటీ ప్రస్తుతం ఏఐ ఆధారిత సెర్చ్ ఇంజిన్‌తో పాటు 'కామెట్' పేరుతో సొంత బ్రౌజర్‌ను కూడా అందిస్తోంది. 2026 నాటికి వందల కోట్ల యూజర్లను సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ సంస్థ, గూగుల్ క్రోమ్ కొనుగోలుతో ఆ లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చని భావిస్తోంది.

# అన్నపూర్ణ స్టూడియోస్ కు 50 ఏళ్లు.. రాళ్ళ గుట్టల నుంచి రీళ్ళ ప్రపంచం వరకు!




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ లోని అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో జూబ్లీహిల్స్ ఒకటి. ఒకప్పుడు ఈ ప్రాంతమంతా బీడు భూములులతో నిండివుండేది. ఇక్కడ రద్దీ రోడ్లు లేవు, ట్రాఫిక్ లేదు, బంగళాలు లేవు. కనుచూపు మేర ఎటు చూసినా కొండలు, గుట్టలు, పాములు తప్ప మరేమీ కనిపించేవి కావు. నడిచేందుకు కనీసం దారి కూడా సరిగా ఉండేది కాదు.

**మద్రాసు నుంచి హైదరాబాద్ కు చిత్ర పరిశ్రమ**

అటువంటి సమయంలో ఒక విజనరీ ఆలోచనతో లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు ముందుకు వచ్చారు. తెలుగు చిత్ర పరిశ్రమ తన సొంత గడ్డపై ఉండాలని సంకల్పించారు. తన దూరదృష్టితో 1975 ఆగస్టు, 13న ఈ బీడు భూమిలో అన్నపూర్ణ స్టూడియోస్ కు పునాది రాయి వేశారు. తెలుగు చిత్ర పరిశ్రమను మద్రాసు నుంచి హైదరాబాద్ కు తరలించాలనే అక్కినేని ఆకాంక్షలకు అనుగుణంగా అన్నపూర్ణ స్టూడియోస్ ప్రాణం పోసుకుంది. ఆ రోజుల్లో జూబ్లీహిల్స్‌కు రోడ్డు కూడా లేకపోవడంతో, ఆయన ఆ ప్రదేశానికి కాలినడకన చేరుకుని ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని ప్రారంభించారు. ఎడ్లబండిపై నిర్మాణ సామాగ్రిని తరలించి స్టూడియో నిర్మాణాన్ని పూర్తి చేశారు. నాడు అక్కినేని నాగేశ్వరరావు తీసుకున్న ముందడుగుతో జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, కృష్ణా నగర్ వంటి ప్రాంతాల అభివృద్ధికి నాంది పలికింది. అప్పటినుండి, అన్నపూర్ణ స్టూడియోస్ కేవలం ఒక స్టూడియో మాత్రమే కాదు, అది హైదరాబాద్ ఫిల్మ్ ఎకోసిస్టమ్‌కు ఒక ఊపిరి పోసింది. 1976 జనవరి 14న నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ఈ స్టూడియోను అధికారికంగా ప్రారంభించారు. ఆ రోజు నుండి అన్నపూర్ణ స్టూడియోస్ దినదినాభివృద్ధి చెందుతోంది.

**స్టూడియో కాదు.. సినీ సామ్రాజ్యం..**

అన్నపూర్ణ స్టూడియోస్ అంటే కేవలం ఒక నిర్మాణ స్థలం కాదు, అది ఒక సృజనాత్మక సామ్రాజ్యం. ఇక్కడ అనేక చిత్రాలు, టీవీ సీరియల్స్, వెబ్ సిరీస్‌లు, వాణిజ్య ప్రకటనలు రూపుదిద్దుకున్నాయి. నేడు, ఈ స్టూడియోలో అత్యాధునిక సాంకేతిక సౌకర్యాలతో కూడిన ఎన్నో షూటింగ్ ఫ్లోర్‌లు, అవుట్‌డోర్ సెట్లు, పోస్ట్-ప్రొడక్షన్ సౌకర్యాలు ఉన్నాయి. ఈ సౌకర్యాలు దేశీయంగానే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో కూడా అగ్రశ్రేణిలో ఉన్నాయి.

**స్టూడియోలోనే మెరీనా బీచ్ సెట్**

'మనసంతా నువ్వే' చిత్రం కోసం నిర్మించిన ప్రసిద్ధ మెరీనా బీచ్ సెట్, 'శ్రీరామదాసు' చిత్రం కోసం నిర్మించిన భద్రాచలం గుడి సెట్ వంటివి ఇక్కడ నిర్మించిన అత్యుత్తమ కళాఖండాల్లో కొన్ని. అలాగే, 'ప్రాణభయాలు', 'అందాల రాముడు', 'సీతారామయ్య గారి మనవరాలు', 'శివమణి', 'మనం' వంటి ఎన్నో సినిమాలు ఇక్కడి స్టూడియోలో షూటింగ్ జరుపుకొని విజయం సాధించాయి. అంతే కాదు అనేక చిత్రాలను కూడా అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మించింది.

**భవిష్యత్తు కోసం విద్యా కేంద్రం**

ANR కళను, ఆశయాలను ముందుకు తీసుకువెళ్తూ, అన్నపూర్ణ స్టూడియోస్ ఇప్పుడు కేవలం సినిమాల నిర్మాణానికే పరిమితం కాలేదు. యువ ప్రతిభను ప్రోత్సహించడానికి అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాను స్థాపించింది. ఈ కాలేజీలో యాక్టింగ్, డైరెక్షన్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, సౌండ్ డిజైన్ వంటి అనేక కోర్సులను బోధిస్తున్నారు. ఈ సంస్థ దేశంలోనే అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇక్కడి నుంచి ప్రతి ఏటా వందలాది మంది విద్యార్థులు సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతూ, ANR గారి కలను సజీవంగా ఉంచుతున్నారు.

**విజయాల ప్రయాణంలో 50 ఏళ్ళు**

ఇప్పుడు అన్నపూర్ణ స్టూడియోస్ తన 50వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఒకప్పుడు బీడు భూమిగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు భారతీయ సినిమాలోని అత్యంత సృజనాత్మక కేంద్రాలలో ఒకటిగా మారింది. అన్నపూర్ణ స్టూడియోస్ ప్రయాణం ఒక కల నుంచి ప్రారంభమై, నిజమై, మరెంతో మంది కలలకు వేదికగా నిలిచింది. ఒక వ్యక్తి దూరదృష్టితో మొదలైన ఈ స్టూడియో ప్రస్థానం, తెలుగు సినిమా భవిష్యత్తుకు ఒక బ్రహ్మాండమైన పునాదిగా నిలిచింది.

ఈ 50 ఏళ్ల ప్రయాణం కేవలం ఒక స్టూడియో విజయగాథ మాత్రమే కాదు, ఒక దృఢ సంకల్పం, ఒక నిర్విరామ కృషి, ఒక గొప్ప కల నిజమైన తీరుగా నిలిచింది. ఈ ప్రస్థానంలో ఎంతో మంది నటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు భాగమయ్యారు. వారిందరి కృషి ఫలితమే నేటి అన్నపూర్ణ స్టూడియోస్. మరో వైపు అన్నపూర్ణ స్టూడియోస్ 50 ఏళ్లను పూర్తిచేసుకున్న సందర్భంగాఅక్కినేని నాగార్జున , అమల కలిసి నటించిన సూపర్ బ్లాక్ బాస్టర్ 'శివ' చిత్రాన్ని 4%ఖ%లో రీ రిలీజ్ చేస్తున్నారు.

# తెలుగు రాష్ట్రాల గజదొంగ అరెస్ట్






**హైదరాబాద్ పెన్ పవర్:** దివ్యాంగుడే..కానీ చేసేది మాత్రం దొంగతనం..రైళ్లలో నిద్రిస్తున్న ప్రయాణికులే అతడి టార్గెట్..రాత్రివేళ్లలో ఏసీ బోగీల్లోకి ప్రవేశించి తన చోరీకళ ప్రదర్శిస్తాడు. చాకచాక్యంగా బ్యాగుల్లోంచి విలువైన వస్తువులు మాయం చేస్తాడు. తెలుగు రాష్ట్రాల్లో కదులుతున్న రైళ్లలో లక్షల సొత్తు కాజేసిన కేటుగాడు. దివ్యాంగుడిగా టికెట్టు తీసుకొని దర్జాగా చోరీలు చేస్తున్న అంతర్ రాష్ట్ర గజదొంగను బుధవారం (ఆగస్టు 13) పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. కదులుతున్న రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర గజదొంగనుపట్టుకున్నారు నెల్లూరు రైల్వే పోలీసులు. రైల్వే డీఎస్పీ వివరాల ప్రకారం..నెల్లూరు, గూడూరు, కావలి సహా పలు రైల్వే స్టేషన్ల పరిధిలో జరిగిన రైలు దొంగతనాల కేసుల దర్యాప్తులో భాగంగా పోలీసులు జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

అతడిని ప్రశ్నించగా అతను పాత నేరస్తుడని, గతంలో హైదరాబాద్, విజయవాడ, కర్నూలు, నంద్యాల, తిరుపతి రైల్వే స్టేషన్లలో జరిగిన 10కి పైగా కేసుల్లో నిందితుడిగా ఉన్నట్టు బయటపడింది. అతని దగ్గర నుంచి రెండు మొబైల్ ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, 143 గ్రాముల బంగారం మొత్తం సుమారు రూ. 12 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. దివ్యాంగుడిగా రైల్వే టికెట్ తీసుకుని రాత్రి వేళల్లో ఏసీ బోగీల్లోకి ప్రవేశించి నిద్రలో ఉన్న ప్రయాణికుల బ్యాగులు, విలువైన వస్తువులను అపహరించడం ఈ దొంగస్టయిల్. అని డీఎస్పీ వెల్లడించారు.

# అందాల నటి సదా వెక్కి వెక్కి ఏడ్చింది.. ఎందుకో తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:**ఎల్లవయ్యా..యెళ్లూ.. అంటూ క్యూట్ గా డైలాగ్ చెబుతూ కుర్రాళ్ల మనసు దోచిన సదా తెలుసుకదా..తొలి సినిమా జయంతోనే తన నటనతో ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్న ఈ భామ.. తెలుగు, తమిళం, మళయాళం, కన్నడ భాషల్లో అనేక చిత్రాల్లో నటించి మెప్పించింది.. అయితే గత కొంతకాలంగా సినిమా ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్న సదా.. వైల్డ్ ఫొటోగ్రాఫర్ గా అవతారమెత్తింది.

అంతాబాగానే ఉంది గానీ..ఇటీవల సదాకు సంబంధించిన ఓ వీడియో బాగా వైరల్ అవుతోంది..ఆ వీడియోలో సదా వెక్కి వెక్కి ఏడుస్తోంది.. సదా ఎందుకు ఏడుస్తోంది..? వివరాల్లోకి వెళితే.. దేశ రాజధాని ఢిల్లీ వీధుల్లో ఎక్కడా వీధికుక్కలు కనిపించొద్దు..8 వారాల్లో వీధి కుక్కలనుపట్టి షెల్టర్లకు తరలించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ విషయంలో ఎవరైనా అడ్డుపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. దేశ అత్యున్న త న్యాయస్థానం తీర్పుపై సినీ ప్రముఖులు, రాజకీయ ప్రముఖులు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సదా కుక్కల పరిస్థితిని తలచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

కేవలం 8 వారాల్లో ఢిల్లీలో ఉన్నవీధికుక్కలను ఎలా తరలిస్తారు.. ఎక్కడ షెల్టర్ కల్పిస్తారు.. అది జరగని పని.. అన్ని కుక్కలకు ఆశ్రయం కల్పించడం కష్టం..ఛాన్సేలేదు.. వాటిని చంపేస్తారు.. అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ముందుగానే ఢిల్లీ ప్రభుత్వం మున్సిపల్ అధికారులు స్పందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని సదా అన్నారు. వీధుల్లో శునకాల పరిస్థితిని ఆలోచిస్తేనే మనసు ముక్కలవుతుంది.. నాకే ఏం చేయాలో తోచడం లేదు.. ఎక్కడ ఎలా నిరసన తెలపాలో తెలియడం లేదు. సుప్రీంకోర్టు తీర్పుతో నా ఆందోళన పెరుగుతోంది.. దయచేసి ఆ తీర్పును వెనక్కి తీసుకోండి అంటూ సదా వెక్కి వె క్కి ఏడ్చేస్తూ ఇన్ స్టాగ్రామ్ లో ఓ పోస్ట్ ను షేర్ చేసింది. అయితే వీధికుక్కలు తరలింపుపై ఇప్పటికీ పలువురు సెలబ్రిటీలు కూడా స్పందించారు.. తీవకనంగా వ్యతిరేకిస్తున్నారు.

# అమెరికా చెబుతున్నా భారత్ వెనక్కి తగ్గట్లేదట!



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా, భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు కీలకమైన దశలో ఉన్నాయి. ఇరు దేశాల మధ్య సుంకాల వివాదం కొనసాగుతుండటంతో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశాన్ని కోరినప్పటికీ, భారత్ మాత్రం తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. దీంతో అమెరికా 25% ఉన్న సుంకాలను 50%కు పెంచింది. ఈ కొత్త సుంకాలు ఆగస్టు 27 నుంచి అమలులోకి రానున్నాయి.

**అమెరికా అసంతృప్తి, భారత్ వైఖరి**

రష్యా నుంచి చమురు దిగుమతులపై అమెరికా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్, భారత్ ఈ ఒత్తిడికి లొంగడం లేదని స్పష్టం చేశారు. సుంకాలు ఉన్నప్పటికీ వాణిజ్య చర్చల విషయంలో భారత్ ఒక్క అడుగు కూడా వెనక్కి వేయలేదని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో పాటు స్విట్జర్లాండ్‌తో కూడా వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుగుతున్నాయని, అక్టోబర్ చివరి నాటికి ఈ చర్చలు పూర్తయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ చర్చల కోసం ట్రంప్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని చెప్పారు.


**భారత్ ప్రతిస్పందన: మోదీ స్పష్టమైన హామీ**

అమెరికా అదనపు సుంకాలను విధించడాన్ని భారత్ తీవ్రంగా ప్రతిఘటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తిదారుల ప్రయోజనాలే తమకు ప్రాధాన్యమని స్పష్టం చేశారు. అవసరమైతే ఈ అదనపు భారాన్ని ప్రభుత్వం భరిస్తుందని కూడా ఆయన హామీ ఇచ్చారు. భారత్ కూడా అమెరికా ఉత్పత్తులపై ప్రతిసుంకాలు విధించింది. ఈ చర్యలు ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత క్లిష్టంగా మార్చాయి.

**భవిష్యత్తు: మోదీ-ట్రంప్ భేటీ కీలకం**

ఈ ఉద్రిక్తతల మధ్య, అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ పిగోట్ న్యూఢిల్లీతో పూర్తి స్థాయి చర్చలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. దీని తర్వాత, ప్రధాని మోదీ త్వరలో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల కోసం అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ఆయన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ కానున్నారు. ఈ సమావేశం వాణిజ్య సమస్యల పరిష్కారానికి ఒక కీలక మలుపు అవుతుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ చర్చల ఫలితమే ఇరు దేశాల భవిష్యత్ వాణిజ్య సంబంధాలను నిర్ణయిస్తుందని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్లు ఎడాపెడా వాడుతున్నారా.. అయితే మీ కిడ్నీలు, బ్రెయిన్, లివర్ మటాష్..!



**హైదరాబాద్ పెన్ పవర్:**మీకు తలనొప్పి, వొళ్ళు నొప్పులు లేదా దెబ్బతగిలిన ప్రతి చిన్నదానికి పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్లు వేసుకుంటుంటారా..? అయితే జాగ్రత్త.. వెంటనే నొప్పి తగ్గేందుకు పెయిన్ కిల్లర్ వేసుకోవడం ఇక ఆపేయండి. ప్రతిదానికి, ప్రతిసారి అలవాటుగా పెయిన్ కిల్లర్ వాడటం వల్ల మీరు ఊహించిన దానికంటే ఎక్కువే ఆరోగ్యానికి గురవుతారు. ఇబుప్రోఫెన్, ఎసిటమినోఫెన్ వంటి పెయిన్ కిల్లర్ నొప్పి తగ్గించడానికి సహాయపడతాయి. అయితే ఎక్కువ మోతాదు తీసుకోవడం, ఇంట్రావీనస్ వాడకం లివర్, కిడ్నీలు, జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపుతాయి.అయితే నొప్పి తగ్గేందుకు పెయిన్ కిల్లర్ ఎక్కువగా వాడటం మంచిది కాదని డాక్టర్లు చెబుతున్నారు. ఇవి మన మెదడులోని రసాయనాలపై చెడు ప్రభావం చూపి మనల్ని వాటికి బానిసలుగా మార్చేస్తాయి. అదే అలవాటు మెల్లిమెల్లిగా ఎక్కువ మోతాదులో వాడాల్సిన పరిస్థితి వస్తుంది. కొన్నిసార్లు ఎక్కువ మోతాదులో వాడితే బిపి, గుండెపోటు సమస్యలు కూడా రావచ్చు. ఢిల్లీకి చెందిన డాక్టర్ మనీష్ కుమార్ ప్రకారం, నొప్పి తగ్గేందుకు పెయిన్ కిల్లర్ ఎక్కువగా వాడితే కాలేయం కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉంది. అంతేకాకుండా మన మానసిక స్థితిని కూడా దెబ్బతీస్తుంది.

**నొప్పి తగ్గే పెయిన్ కిల్లర్ వల్ల కలిగే నష్టాలు:**

1. లివర్ సమస్యలు: ఎసిటమినోఫెన్ లాంటి పెయిన్ కిల్లర్ ఎక్కువగా వాడితే లివర్ చెడు పదార్థాలను బయటకు పంపే పనిని సరిగ్గా చేయలేదు. దింతో లివర్ ఉబ్బడం, దెబ్బతినడం లేదా పూర్తిగా చెడిపోయే అవకాశం ఉంది.
2. కిడ్నీ సమస్యలు: ఇబుప్రోఫెన్ లాంటి పెయిన్ కిల్లర్ కిడ్నీలకు రక్త ప్రసరణను తగ్గిస్తాయి. దీనివల్ల కిడ్నీలు రక్తాన్ని శుద్ధి చేయలేవు. ఎక్కువ కాలం ఈ మందులు వాడితే కిడ్నీలు పాడైపోవచ్చు. ఇప్పటికే కిడ్నీ సమస్యలు, డీహైడ్రేషన్ లేదా బీపీ ఉన్నవాళ్లకు ఈ ప్రమాదం ఇంకా ఎక్కువ ఉండొచ్చు.
3. కడుపులో సమస్యలు: %చీూూ×ణ% అని పిలిచే మందులు ఎక్కువగా వాడితే కడుపులో మంట, పుండ్లు (%బశ్రీషవతీం%) ఏర్పడవచ్చు. కొన్నిసార్లు కడుపులో రక్తస్రావం కూడా జరగవచ్చు. మొదట్లో అజీర్ణంతో మొదలయ్యే ఈ సమస్యకి వైద్యం చేయకపోతే చాల ప్రమాదం.
4. గుండెకు ప్రమాదాలు: కొన్ని నొప్పి మందులు (%చీూూ×ణ% లు) రక్తపోటును పెంచి శరీరంలో నీరు పేరుకుపోయేలా చేస్తాయి. దీనివల్ల గుండెపోటు లేదా పక్షవాతం వచ్చే ప్రమాదం పెరుగుతుంది. గుండె జబ్బులు ఉన్నవారు ఈ మందులను వాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి.
5. పెయిన్ కిల్లర్ పై ఆధారపడటం: కొన్ని నొప్పి తగ్గించే మందులు నొప్పిని తగ్గించడంతో పాటు మెదడులో తృప్తిని ఇచ్చే రసాయనాలను ప్రేరేపిస్తాయి. దీనివల్ల మెదడు ఈ మందులకు అలవాటు పడి వాటిపై ఆధారపడటం మొదలుపెడుతుంది. ఈ మందులను వాడడం ఆపేసిన ఎదో ఆందోళన, నిద్రలేకపోవడం, కండరాల నొప్పి లాంటి సమస్యలు వస్తాయి. అందుకే డాక్టర్లకి చెప్పకుండా ఈ మందుల వాడకం ఒక్కసారిగా ఆపడం చాలా కష్టం అని డాక్టర్ కుమార్ హెచ్చరిస్తున్నారు.

# వర్షం ఎఫెక్ట్.. శంషాబాద్ ఎయిర్ పోర్టుకు రావాల్సిన ఐదు విమానాలు దారి మళ్లింపు



**హైదరాబాద్ పెన్ పవర్:**శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు రావలసిన ఐదు విమానాలు దారిమళ్లించారు అధికారులు. పలు ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు రావాల్సిన మూడు విమానాలను విజయవాడకు మళ్ళించిన అధికారులు.. మరో రెండు విమానాలను తిరుపతి, బెంగలూరుకు మళ్ళించారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో వాతావరణం అనుకూలించకపోవడంతో దారి మళ్లించినట్లు తెలిపారు అధికారులు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు రోజులుగా తెలంగాణతో పాటు ఏపీలో పలు జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. ప్రధాన రహదారులు చెరువుల్లా తలపిస్తున్నాయి.తెలంగాణ, ఏపీల్లో పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. చెరువులు, కుంటలు ఉప్పొంగి పొర్లుతున్నాయి. రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ రోజు (బుధవారం,ఆగస్టు 13) తెలంగాణ రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి , ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, ములుగు, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్ , యాదాద్రి భువనగిరి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రెడ్ అలెర్ట్ జారీ చేసింది ఐఎండీ.

### ఆర్థిక సంస్థను నడపడం మానేసి డీజేగా ఉండు..

## గోల్డ్‌మన్ సీఈఓకు ట్రంప్ చురకలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ అయిన గోల్డ్‌మన్ శాక్స్ సీఈఓ డేవిడ్ సోలమన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బ్యాంకును నడపడం మానేసి, ఆయనకు అలవాటున్న డిస్కో జాకీ (డీజే) పని చూసుకోవడం మంచిదని ఘాటుగా వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం విధించిన టారిఫ్‌ల (సుంకాలు) ప్రభావాన్ని తక్కువ చేసి చూపుతూ గోల్డ్‌మన్ శాక్స్ ఇచ్చిన నివేదికపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ట్రంప్ విధించిన సుంకాల భారాన్ని అమెరికా వినియోగదారులే మోస్తున్నారని గోల్డ్‌మన్ శాక్స్ ఆదివారం విడుదల చేసిన ఒక నివేదికలో పేర్కొంది. జూన్ వరకు సుంకాల వ్యయంలో సుమారు 22 శాతం భారాన్ని వినియోగదారులే భరించారని, కొత్త టారిఫ్‌లు కూడా ఇదే పద్ధతిలో కొనసాగితే ఈ భారం 67 శాతానికి పెరిగే అవకాశం ఉందని ఆ నివేదిక అంచనా వేసింది. ఈ నివేదికపైనే ట్రంప్ మండిపడ్డారు.
మంగళవారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ స్పందించారు. "డేవిడ్ సోలమన్, గోల్డ్‌మన్ శాక్స్ సంస్థ ఇవ్వాల్సిన గౌరవాన్ని ఇవ్వడం లేదు. మార్కెట్‌పై, సుంకాలపై చాలా కాలం క్రితమే వారు తప్పుడు అంచనాలు వేశారు. అవి పూర్తిగా తప్పని తేలింది. అనేక ఇతర విషయాల్లోలాగే దీనిలోనూ వారు పొరబడ్డారు. డేవిడ్ వెళ్లి కొత్త ఆర్థికవేత్తను నియమించుకోవాలి, లేదంటే డీజేగా ఉండటంపై దృష్టి పెట్టాలి. అంతేకానీ, ఒక పెద్ద ఆర్థిక సంస్థను నడపాల్సిన అవసరం లేదు" అని ట్రంప్ విమర్శించారుట్రంప్ వాదనకు ఆయన వాణిజ్య సలహాదారు పీటర్ నవారో కూడా మద్దతు పలికారు. "ప్రస్తుతం అమెరికాలో బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ తర్వాత అత్యంత తక్కువ విశ్వసనీయత ఉన్న డేటా గోల్డ్‌మన్ శాక్స్‌దే" అని ఆయన ఎద్దేవా చేశారు.

## 48 గంటలు భారీ వర్షాలు.. ఎమర్జెన్సీ అయితే తప్ప బయటకు రాకండి



హైదరాబాద్ వ్యాప్తంగా పలు చోట్ల భారీ వర్షాలు పడుతున్నాయి. ఆగస్టు 13 నుంచి ఆగస్టు 15 వరకు భారీ వర్షాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. భారీ వర్షాలకు ఇప్పటికే అప్రమత్తమైన ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను, మంత్రులను,అధికారులను అప్రమత్తం చేశారు సీఎం రేవంత్. ప్రభుత్వ ఉద్యోగులకు మూడు రోజులు సెలవులు రద్దు చేశారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన చెప్పారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉన్నవాళ్ళని ఖాళీ చేయిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 58 ప్రాంతాల్లో వాటర్ లాగింగ్ ప్రాంతాలు ఉన్నాయని చెప్పారు.మరో వైపు హైదరాబాద్ లో భారీ వర్షాలకు హైడ్రా సన్నద్ధంగా ఉందన్నారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్,
జలమండలి, విద్యుత్ అధికారుల సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరద నీళ్లు వస్తే పబ్లిక్ ను రెస్క్యూ చేయడానికి బోట్స్ తో సహా అన్ని ఎక్విప్మెంట్స్ సిద్ధంగా పెట్టుకున్నామన్నారు. రాత్రి సమయంలో వర్షపాతం ఎక్కువగా నమోదయ్యే అవకాశాలుండటంతో ఈ రోజు రాత్రి హైడ్రా టీమ్స్ అందుబాటులో ఉంటాయని చెప్పారు.
నాలాల కబ్జాలతో రోడ్లపై వరద నీళ్లు వస్తున్నాయని రంగనాథ్ చెప్పారు. ఓ ఆర్ ఆర్ పరిధిలో 400 కి పైగా వాటర్ లాగింగ్ పాయింట్స్ ఉన్నాయన్నారు. మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్స్ దగ్గర ఇప్పటికే సిబ్బంది ఉన్నారని తెలిపారు. అత్యవసరమైతే తప్ప పబ్లిక్ బయటకి రావొద్దని సూచించారు. ఒకవేళ భారీ వర్షాలు వస్తే యూత్ కూడా సహాయక చర్యల్లో పాల్గొనాలని కోరారు రంగనాథ్.

## రాఖీ పండుగ.. ఆర్టీసీలో రికార్డు స్థాయిలో మహిళల ప్రయాణాలు


- ఆరు రోజుల్లో 3.68 కోట్ల రాకపోకలు
- 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నట్లు ఆర్టీసీ వెల్లడి
- 7 నుంచి 12వ తేదీ వరకు ప్రయాణాలు




**హైదరాబాద్ పెన్ పవర్:**రాఖీ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో మహిళలు రికార్డు స్థాయిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు సాగించారు. ఆగస్టు 7 నుంచి 12వ తేదీ వరకు ఈ ఆరు రోజుల్లో మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించగా, అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నట్లు ఆర్టీసీ సంస్థ తెలిపింది. ఈ మేరకు సంస్థ ఎండీ సజ్జనార్ 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ రోజున 45.62 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని సజ్జనార్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 11న అత్యధికంగా 45.94 లక్షల మంది రాకపోకలు సాగించారని, ఒక్కరోజులో ఇంతమంది మహిళలు ప్రయాణించడం ఇదే తొలిసారి అని వెల్లడించారు.గత ఏడాది రాఖీ పండుగకు 2.75 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశామని, అప్పటితో పోలిస్తే ఈ సంవత్సరం 92.95 లక్షల మంది ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని ఆయన తెలిపారు. ఈ ఏడాది బస్సులు 2.28 కోట్ల కిలోమీటర్ల మేర తిరిగాయని, గత ఏడాదితో పోలిస్తే 53 లక్షల కిలోమీటర్లు అదనంగా తిరిగాయని ఆయన వెల్లడించారు.

# గవర్నర్ చేతుల మీదుగా డిగ్రీకి నో...
# వీసీ నుంచి తీసుకున్న పీహెచ్‌డీ స్కాలర్

- తమిళనాడులో స్నాతకోత్సవంలో అనూహ్య ఘటన
- గవర్నర్ ఆర్.ఎన్. రవి చేతుల మీదుగా పట్టా తీసుకునేందుకు విద్యార్థిని నిరాకరణ
- గవర్నర్‌ను దాటుకుని వెళ్లి వీసీ నుంచి డిగ్రీ స్వీకరణ
- గవర్నర్ తమిళ ప్రయోజనాలకు వ్యతిరేకి అని ఆరోపించిన మహిళ
- నిరసన తెలిపిన విద్యార్థిని డీఎంకే నేత భార్యగా గుర్తింపు




**హైదరాబాద్ పెన్ పవర్:**తమిళనాడులోని ఓ విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సలర్ ఆర్.ఎన్. రవి చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా స్వీకరించేందుకు ఓ విద్యార్థిని నిరాకరించారు. గవర్నర్‌ను దాటుకుని నేరుగా వైస్-ఛాన్సలర్ వద్దకు వెళ్లి ఆమె డిగ్రీని స్వీకరించారు. ఈ ఘటన ప్రస్తుతం రాజకీయంగా చర్చనీయాంశమైంది.
తిరునల్వేలిలోని మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయం (ఎంఎస్‌యూ) 32వ స్నాతకోత్సవం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి 650 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వేదికపై ఉన్న గవర్నర్ ఆర్.ఎన్. రవి నుంచి విద్యార్థులు ఒక్కొక్కరిగా పట్టాలు అందుకుంటున్నారు. ఈ క్రమంలో నాగర్‌కోయిల్‌కు చెందిన పరిశోధక విద్యార్థిని జీన్ జోసెఫ్ వంతు వచ్చింది. ఆమె వేదికపైకి వెళ్లి గవర్నర్‌ను పట్టించుకోకుండా దాటి వెళ్లిపోయారు. నేరుగా వైస్-ఛాన్సలర్ ఎన్. చంద్రశేఖర్ వద్దకు వెళ్లి ఆయన చేతుల మీదుగా తన పీహెచ్‌డీ పట్టాను స్వీకరించారు.
ఈ ఊహించని చర్యతో వేదికపై ఉన్న అధికారులు, సభలో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. అయితే, గవర్నర్ రవి మాత్రం సంయమనం పాటిస్తూ ఏమీ జరగనట్టుగా ఉండిపోయారు.
అనంతరం మీడియాతో మాట్లాడిన జీన్ జోసెఫ్ తన చర్యను సమర్థించుకున్నారు. "గవర్నర్ ఆర్.ఎన్. రవి తమిళనాడు, తమిళ ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. అందుకే ఆయన చేతుల మీదుగా నా డిగ్రీని తీసుకోవడానికి నేను ఇష్టపడలేదు" అని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.
జీన్ జోసెఫ్... డీఎంకే పార్టీకి చెందిన నాగర్‌కోయిల్ టౌన్ యూనిట్ డిప్యూటీ సెక్రటరీ ఎం. రాజన్ భార్య అని తెలిసింది. రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య పలు విధానపరమైన అంశాలు, విశ్వవిద్యాలయ నియామకాలపై కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆమె ఇలా నిరసన తెలిపారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.
ఈ ఘటనపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమె ధైర్యాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు
స్నాతకోత్సవం లాంటి వేదికను రాజకీయ నిరసనలకు వాడుకోవడం సరికాదని విమర్శిస్తున్నారు. ఈ విషయంపై విశ్వవిద్యాలయ అధికారులు గానీ, గవర్నర్ కార్యాలయం గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

# గుండె జబ్బులను 43 శాతం వరకు తగ్గించే అద్భుతమైన విటమిన్ ఇదే!

- ఇటీవలి కాలంలో పెరుగుతున్న హృద్రోగ మరణాలు
- విటమిన్ కే1ను నిత్యం తీసుకోవడం ద్వారా తగ్గనున్న గుండె జబ్బుల ముప్పు
- 70 ఏళ్లు పైబడిన 1,400 మంది మహిళలపై 14 ఏళ్ల పాటు జరిపిన పరిశోధనలో వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవలి కాలంలో హృదయ సంబంధిత వ్యాధులతో మరణిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. అయితే, ఈ ముప్పును గణనీయంగా తగ్గించే విటమిన్‌ను తాజా అధ్యయనం గుర్తించింది. విటమిన్ 'కే1'ను నిత్యం తీసుకోవడం వల్ల గుండె జబ్బుల ముప్పు గణనీయంగా తగ్గుతుందని అధ్యయనం తెలిపింది. విటమిన్ కే1ను సరైన మోతాదులో తీసుకోవడం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని 43 శాతం వరకు తగ్గించుకోవచ్చని అధ్యయనం వివరించింది. 'ది అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్'లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. 70 ఏళ్లు పైబడిన 1,400 మంది మహిళలపై 14 సంవత్సరాల పాటు జరిపిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. ఈ పరిశోధనలో భాగంగా రోజుకు 120 మిల్లీ గ్రాముల విటమిన్ K1 తీసుకున్నవారికి, గుండె సంబంధిత వ్యాధుల వల్ల వచ్చే మరణాల ప్రమాదం తక్కువగా ఉందని కనుగొన్నారు.

### విటమిన్ K1 ఎలా పనిచేస్తుంది?

మన శరీరంలోని ధమనుల్లో కాల్షియం పేరుకుపోవడం వల్ల అవి గట్టిపడతాయి. ఈ పరిస్థితి వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశం పెరుగుతుంది. విటమిన్ కే1, మ్యాట్రిక్స్ జీఎల్‌ఏ ప్రొటీన్ (ఎంజీపీ) అనే రసాయనాన్ని సక్రియం చేయడం ద్వారా, ధమనుల్లో కాల్షియం పేరుకుపోకుండా నిరోధిస్తుంది. ఈ ప్రక్రియ వల్ల ధమనులు ఆరోగ్యంగా ఉంటాయి, గుండె కూడా సురక్షితంగా ఉంటుంది.

### విటమిన్ కే1 ఎందులో ఉంటుంది?

ఆకుకూరలైన పాలకూర, బ్రకోలీ వంటి వాటిలో విటమిన్ కే1 పుష్కలంగా లభిస్తుంది. రోజుకు ఒకటి నుంచి ఒకటిన్నర కప్పుల ఆకుకూరలు తీసుకోవడం వల్ల మన శరీరానికి కావలసినంత విటమిన్ కే1 లభిస్తుంది. అయితే, వార్ఫరిన్ వంటి రక్తం పలచబరిచే మందులు వాడేవారు, ఆహారంలో ఏమైనా మార్పులు చేసే ముందు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# పాక్ ఆర్థిక కష్టాలు... నిజమైన భారత్ హెచ్చరికలు

- ఐఎంఎఫ్ నిర్దేశించిన ఐదు లక్ష్యాలలో మూడింటిని అందుకోలేకపోయిన దాయాది దేశం
- పన్నుల వసూళ్లలో విఫలం... రిటైలర్ల పథకం అట్టర్ ఫ్లాప్
- పాక్ తీరుపై భారత్ ఎప్పటినుంచో చేస్తున్న వాదనలు నిజమయ్యాయి
- పాక్ ఆర్థిక వ్యవస్థలో సైన్యం జోక్యమే కారణమని భారత్ ఆరోపణ
- అంతర్జాతీయ నిధులు ఉగ్రవాదానికి మళ్లుతున్నాయని భారత్ ఆందోళన




**హైదరాబాద్ పెన్ పవర్:**పాకిస్థాన్ విషయంలో భారత్ ఎప్పటినుంచో వ్యక్తం చేస్తున్న ఆందోళనలు, వాదనలు మరోసారి నిజమయ్యాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి 7 బిలియన్ డాలర్ల బెయిలౌట్ ప్యాకేజీ పొందేందుకు విధించిన షరతుల్లో పాకిస్థాన్ ఘోరంగా విఫలమైంది. నిర్దేశించిన ఐదు కీలక లక్ష్యాలలో మూడింటిని అందుకోలేకపోయింది. ఐఎంఎఫ్ నిబంధనలను పాటించడంలో పాకిస్థాన్‌కు చెత్త రికార్డు ఉందని, ఆ దేశం తరచూ రుణాలు తీసుకుంటుందని భారత్ చేస్తున్న వాదనలకు ఈ పరిణామం బలం చేకూర్చింది. పాకిస్థాన్ ఫెడరల్ బోర్డ్ ఆఫ్ రెవెన్యూ (ఎఫ్‌బీఆర్) రెండు ప్రధాన ఆర్థిక లక్ష్యాలను చేరుకోలేకపోయింది. మొత్తం 12.3 లక్షల కోట్ల రూపాయల రాబడిని సేకరించడంలో విఫలమైంది. అంతేకాకుండా, రిటైలర్లపై పన్ను విధించేందుకు ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన 'తాజిర్ దోస్త్ పథకం' ద్వారా 50 బిలియన్ రూపాయలు సమీకరించాలన్న లక్ష్యం కూడా నెరవేరలేదు. ఈ పథకం పూర్తిగా విఫలమైనట్లు పాకిస్థాన్‌కు చెందిన 'ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' పత్రిక తన కథనంలో పేర్కొంది. దీనికి తోడు, జూన్‌తో ముగిసిన గత ఆర్థిక సంవత్సరంలో పాక్‌లోని రాష్ట్రాలు కూడా అధిక వ్యయాల కారణంగా 1.2 లక్షల కోట్ల రూపాయలను ఆదా చేయడంలో విఫలమైనట్లు ఆ దేశ ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది.

ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి పాకిస్థాన్‌కు అందే నిధులను ఆ దేశం సైనిక అవసరాలకు, సరిహద్దు ఉగ్రవాద కార్యకలాపాలకు దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని భారత్ మొదటి నుంచి వ్యతిరేకిస్తోంది. గత ఐఎంఎఫ్ సమావేశంలో భారత ప్రతినిధి పరమేశ్వరన్ అయ్యర్ మాట్లాడుతూ, "ప్రపంచ ఆర్థిక సంస్థలు అనుసరించే విధానాల్లో నైతిక విలువలకు సరైన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ తీవ్రమైన లోటు స్పష్టం చేస్తోంది" అని తెలిపారు. పాకిస్థాన్ పదేపదే ఐఎంఎఫ్ నుంచి రుణాలు తీసుకుంటోందని, కానీ వాటి షరతులను అమలు చేయడంలో ఎప్పుడూ విఫలమవుతోందని భారత్ ఎత్తిచూపింది. గతంలో తీసుకున్న ప్యాకేజీలు సరైన ఫలితాలనిచ్చి ఉంటే, పాకిస్థాన్ మళ్లీ బెయిలౌట్ కోసం ఐఎంఎఫ్ వద్దకు రావలసిన పరిస్థితి ఉండేది కాదని పేర్కొంది. పాకిస్థాన్ ఆర్థిక వ్యవహారాల్లో సైన్యం జోక్యం చేసుకోవడం వల్లే విధానపరమైన లోపాలు తలెత్తుతున్నాయని, సంస్కరణలు వెనక్కి వెళుతున్నాయని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది.

ప్రస్తుతం అక్కడ పౌర ప్రభుత్వం ఉన్నప్పటికీ, ఆర్థిక వ్యవస్థపై సైన్యం పట్టు కొనసాగుతోందని, స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫెసిలిటేషన్ కౌన్సిల్‌లో కూడా సైన్యమే కీలక పాత్ర పోషిస్తోందని గుర్తుచేసింది. రాజకీయ కారణాల వల్లే పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ పదేపదే రుణాలు ఇస్తోందనే అభిప్రాయం ఉందని భారత్ విశ్లేషించింది.

# జపాన్ దేశం అరుదైన రికార్డ్ : 100 ఏళ్లు దాటిన వృద్ధులు లక్ష మంది..!



**హైదరాబాద్ పెన్ పవర్:**మన దేశం ఆర్థికంగా పరుగులు పెడుతుంటే జపాన్ మాత్రం వందేళ్ళు దాటినా వృద్ధుల జనాభాతో రికార్డులు కొడుతుంది. జపాన్‌లో 100 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వాళ్ళు ఇప్పుడు రికార్డు స్థాయిలో 95వేలు దాటారు. వీరిలో దాదాపు 90 శాతం మంది మహిళలే అని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. అయితే ఇవన్నీ అంచనాల లెక్కల ప్రకారం కాదు, ప్రభుత్వ డేటానే. సెప్టెంబర్ 1 నాటికి జపాన్‌లో 95,119 మంది వందేళ్లు దాటినా వారు ఉండగా, గత ఏడాదితో పోలిస్తే 2,980 ఎక్కువ. వీరిలో 83,958 మంది మహిళలు, 11,161 మంది పురుషులు ఉన్నారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ చెబుతుంది. సెప్టెంబర్ 15న ఓ స్పెషల్ ప్రభుత్వ డేటా ప్రకారం చూస్తే 65 ఏళ్లు దాటిన వారి సంఖ్య 36.25 మిలియన్లతో రికార్డు స్థాయికి చేరుకుంది, ఇది జపాన్ జనాభాలో 29.3 శాతం. వందేళ్లు నిండి లక్ష కంటే ఎక్కువ వృద్ధ జనాభా ఉన్న 200 దేశాల లిస్టులో జపాన్ అగ్రస్థానంలో ఉందని సమాచార మంత్రిత్వ శాఖ తెలిపింది. అమెరికాకు చెందిన జెరోంటాలజీ రీసెర్చ్ గ్రూప్ ప్రకారం, ప్రస్తుతం జపాన్‌లో ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలైన టోమికో ఇటూకా ఉన్నారు. ఆమె 23 మే 1908న జన్మించగ, ఆమె వయస్సు ఇప్పటికి 116 సంవత్సరాలు. టోమికో ఇటూకా పశ్చిమ జపాన్ హ్యోగో ప్రిఫెక్చర్‌లోని ఆషియాలో ఒక నర్సింగ్ హోమ్‌లో ఉంటున్నారు. జపాన్‌లోని అత్యంత వృద్ధుడు 110 ఏళ్ల కియోటకా మిజునో నా జీవిత రహస్యం ఏమిటో నాకు అస్సలు తెలియదు అని అక్కడి మీడియాతో చెప్పడం విశేషం. గతంలో రికార్డు సాధించిన మరియా బ్రాన్యాస్ మోరెరా 117 సంవత్సరాల వయసులో స్పెయిన్‌లో మరణించారు. మిడ్ జపాన్‌లోని షిజుయోకా ప్రిఫెక్చర్‌లోని ఇవాటాలో కుటుంబంతో ఉంటున్న మిజునో ప్రతిరోజూ ఉదయం 6.30 గంటలకు లేచి ఆహారం గురించి పెద్దగా ఆలోచించకుండా మూడు పూటలా తింటానని, సుమో రెజ్లింగ్ సహా లైవ్ స్పోర్ట్స్ వినడం అతని హాబీ అని అన్నారు. జపాన్‌లో వృద్ధుల జనాభా పెరుగుదల వైద్య & సంక్షేమ ఖర్చులకు దారితీస్తుండటంతో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. గత ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశ మొత్తం జనాభా 124 మిలియన్లు, గత ఏడాది 595,000 తగ్గింది. ప్రభుత్వం వృద్ధుల జనాభా తగ్గించడానికి ప్రయత్నించిన సక్సెస్ కాలేకపోయింది, అయితే రిటైర్మెంట్ వయస్సు పొడిగిస్తూ 2025 ఆర్థిక సంవత్సరం నుండి అన్ని కంపెనీలలో 65 ఏళ్లుగా మారింది.

## 20 మంది బంగ్లాదేశీయులను బీఎస్ఎఫ్‌కు అప్పగించిన తెలంగాణ పోలీసులు

- దేశవ్యాప్తంగా అక్రమంగా నివసిస్తున్న పలువురు బంగ్లాదేశీయులు
- హైదరాబాద్‌లో 20 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసుల వెల్లడి
- అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులపై కొరడా




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో అక్రమంగా నివసిస్తున్న పలువురు బంగ్లాదేశీయులను తెలంగాణ పోలీసులు సరిహద్దు భద్రతా దళానికి (బీఎస్ఎఫ్) అప్పగించారు. ఈ విషయాన్ని తెలంగాణ పోలీసులు అధికారికంగా ధృవీకరించారు. సుమారు 20 మంది బంగ్లాదేశీయులను దేశ సరిహద్దు వద్ద బీఎస్ఎఫ్ అధికారులకు అప్పగించినట్లు రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. హైదరాబాద్ నగరంతో పాటు దేశవ్యాప్తంగా అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుం టున్నారు. హైదరాబాద్ నగరంలో ఇదివరకే పలుమార్లు బంగ్లాదేశీయులను అదుపులోకి తీసుకున్నారు. తాజాగా, వారిని బీఎస్ఎఫ్‌కు అప్పగించారు.

## చందానగర్ ఖజానా జువెలర్స్ చోరీ కేసులో పురోగతి

- ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రెండు బైక్ లపై పారిపోతుండగా పట్టుకున్న పోలీసులు
- వీరు ప్రయాణిస్తున్న బైక్ లు కూడా దొంగిలించినవే




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ చందానగర్ లో సంచలనం సృష్టించిన ఖజానా జువెలర్స్ దోపిడీ కేసులో పోలీసులు కొంత పురోగత సాధించారు. పటాన్ చెరు రోడ్ పై వెళుతున్న ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. సంగారెడ్డి సమీపంలో మరో ముగ్గురిని పట్టుకున్నారు. వీరంతా రెండు బైక్ లపై పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. ముఖాలకు మాస్క్ లు, తలకు క్యాప్ లు, చేతులకు గ్లౌజులు ధరించి ప్రయాణిస్తుండటంతో వీరి కదలికలు పోలీసులకు అనుమానం కలిగించారు. వీరు ప్రయాణిస్తున్న బైకులు కూడా దొంగిలించినవేనని పోలీసులు గుర్తించారు. ఈ ఆరుగురిని పోలీస్ స్టేషన్ కు తరలించి, వారిపై కేసు నమోదు చేశారు. ఈ దోపిడీ వెనుక ఉన్న వ్యక్తుల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

# 2030 కామన్వెల్త్ గేమ్స్.. ఆతిథ్యం కోసం భారత్ అధికారిక బిడ్.. ఐఓఏ గ్రీన్ సిగ్నల్

- 2030 కామన్వెల్త్ గేమ్స్ ఆతిథ్యం కోసం భారత్ అధికారిక ప్రయత్నాలు
- భారత్ బిడ్‌కు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఏకగ్రీవ ఆమోదం
- కెనడా తప్పుకోవడంతో పెరిగిన అవకాశాలు
- వేదికగా గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరం ప్రతిపాదన
- తుది బిడ్ పత్రాల సమర్పణకు ఆఖరి ఆగస్టు 31
- నిర్వహణ ఖర్చు మొత్తం కేంద్ర ప్రభుత్వమే భరించనున్నట్లు స్పష్టత




**హైదరాబాద్ పెన్ పవర్:** 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్యం దిశగా భారత్ ఒక కీలక ముందడుగు వేసింది. ఈ మెగా క్రీడల నిర్వహణకు భారత్ దాఖలు చేయనున్న బిడ్‌కు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధికారికంగా ఆమోదముద్ర వేసింది. బుధవారం జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో (ఎస్‌జీఎం) ఈ మేరకు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని ప్రధాన వేదికగా ప్రతిపాదిస్తూ ఈ బిడ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ పోటీ నుంచి కెనడా వైదొలగడంతో 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులను పొందేందుకు భారత్‌కు అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ఇప్పటికే ప్రాథమిక ఆసక్తిని వ్యక్తం చేసిన భారత్, తుది బిడ్ పత్రాలను ఆగస్టు 31 లోపు సమర్పించాల్సి ఉంది. ఈ క్రీడల నిర్వహణకు అయ్యే పూర్తి ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని ఐఓఏ స్పష్టం చేసింది. ఈ సమావేశం అనంతరం ఐఓఏ జాయింట్ సెక్రటరీ కల్యాణ్ చౌబే మాట్లాడుతూ, "జనరల్ హౌస్ ఈ ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇకపై మా సన్నాహాలను వేగవంతం చేస్తాం" అని తెలిపారు. ఇటీవల కామన్వెల్త్ స్పోర్ట్ గేమ్స్ డైరెక్టర్ డారెన్ హాల్ నేతృత్వంలోని బృందం అహ్మదాబాద్‌లోని క్రీడా వేదికలను పరిశీలించి, గుజరాత్ ప్రభుత్వ అధికారులతో సమావేశమైంది. ఈ నెలలోనే మరో పెద్ద ప్రతినిధి బృందం పర్యటించనుంది. 2026 గ్లాస్గో క్రీడల మాదిరిగా కాకుండా, 2030లో పూర్తిస్థాయిలో అన్ని క్రీడాంశాలతో గేమ్స్ నిర్వహిస్తామని ఐఓఏ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు రోహిత్ రాజ్‌పాల్ అన్నారు. "భారత్‌కు ఎక్కువ పతకాలు

తెచ్చిపెట్టే షూటింగ్, ఆర్చరీ, రెజ్లింగ్ వంటి క్రీడలతో పాటు మన దేశీయ క్రీడలైన కబడ్డీ, ఖో-ఖోలను కూడా చేర్చాలని యోచిస్తున్నాం" అని ఆయన వివరించారు.

కామన్వెల్త్ స్పోర్ట్ జనరల్ అసెంబ్లీ నవంబర్ చివరి వారంలో గ్లాస్గోలో సమావేశమై ఆతిథ్య దేశంపై తుది నిర్ణయం తీసుకోనుంది. భారత్ గతంలో 2010లో ఢిల్లీ వేదికగా కామన్వెల్త్ క్రీడలను విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే.

# హైదరాబాద్‌లో నాలాలో పడిపోయిన వ్యక్తిని కాపాడిన కార్పొరేటర్!




- మేకకు మేత తీసుకురావడానికి వెళ్లి పట్టుతప్పి నాలాలో పడిపోయిన గౌస్
- నాలా పక్కన ఆకులు కోస్తున్న సమయంలో సంఘటన
- స్థానికుల సహాయంతో కాపాడిన కార్పొరేటర్ మహ్మద్ వాసె

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ నగరంలోని పాతబస్తీలో ప్రమాదవశాత్తూ నాలాలో పడిన వ్యక్తిని కార్పొరేటర్, స్థానికులు కలిసి రక్షించారు. ఈ సంఘటన యాకుత్‌పురా పరిధిలో జరిగింది. గౌస్ అనే వ్యక్తి తన మేక కోసం మేత తీసుకురావడానికి వెళ్లి కాలు జారి నాలాలో పడిపోయాడు. నాలా పక్కనే ఆకులు కోస్తున్న సమయంలో ఈ దుర్ఘటన సంభవించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నాలా ఉధృతంగా ప్రవహిస్తోంది. గౌస్ నాలాలో పడిపోయిన సమాచారం తెలియడంతో

స్థానిక కార్పొరేటర్ మహ్మద్ వాసె వెంటనే స్పందించి స్థానికుల సహాయంతో అతడిని సురక్షితంగా బయటకు తీశారు. గౌస్ క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.